

నేర్పించండి!

విజ్ఞానానికి, మనోవికాసానికి మార్గ నిర్దేశనం చేసేది పుస్తకం.. శుక్రవారం జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం. 8లో



వస్త్ర దుకాణంలో మందులు

అది ఓ వస్త్ర దుకాణం. కానీ అక్కడ రహస్యంగా మందుల అమ్మకాలు సాగుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ దాడుల్లో వెలుగుచూసింది. 8లో



ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పర్యటన

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ గురువారం వాల్తేర్ డివిజన్ పరిధిలో పర్యటించారు. 8లో

సింహాద్రికి గ్రీన్‌సిగ్నల్

- మరో ఐదు రైళ్ల సర్వీసులకు కూడా..
- సాక్షి కథనానికి రైల్వే అధికారుల్లో కదలిక
- దిగొచ్చిన దక్షిణ మధ్య రైల్వే
- పునరుద్ధరించిన రైళ్లు



విశాఖ సిటీ: పేదవాడి రైళ్లు మళ్లీ పట్టాలెక్కనున్నాయి. ఆరు నెలలుగా నడవని సింహాద్రి ఎక్స్‌ప్రెస్ కూత పెట్టనుంది. 50 రోజులుగా నిలిపేసిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ విశాఖ నుంచి మళ్లీ పరుగులు తీయనుంది. 'వాల్తేరుపై పగ' శీర్షికతో సాక్షి ప్రచురించిన కథనానికి రైల్వే అధికారుల్లో కదలిక వచ్చింది. రద్దు చేసిన ఆరు రైలు సర్వీసులను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఫలితంగా ప్రయాణికులకు ఎంతో ఊరట కలగనుంది.

వాల్తేరుపై చిన్నచూపు

ఆదాయంలో దూసుకుపోతున్న వాల్తేరు డివిజన్‌పై రైల్వే ఉన్నతాధికారులకు చిన్న చూపే ఉంది. ఒక వైపు దక్షిణ మధ్య రైల్వే, మరోవైపు తూర్పు కోస్తా రైల్వే డివిజన్ అధికారులు వాల్తేరుపై పగ పట్టినట్లు వ్యవహరిస్తున్నారు. డివిజన్‌లో అత్యధికంగా ఆదాయం వచ్చే విశాఖ నుంచి రైళ్ల మళ్లింపు, రద్దు నిర్ణయాలు తీసుకుంటుండడం అందరికీ విస్మయాన్ని కలిగిస్తోంది. విశాఖలో ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటును జాప్యం చేస్తూ వస్తున్న కేంద్ర ప్రభుత్వం.. విశాఖ నుంచి రైళ్ల మళ్లింపు, రద్దు నిర్ణయాలకు అడ్డుకట్ట వేయకపోవడం గమనార్హం. ఆదాయం దెబ్బకొట్టడానికి ఒకవైపు దక్షిణ మధ్య రైల్వే, మరోవైపు తూర్పు కోస్తా రైల్వే అధికారులు ఎప్పటికప్పుడు వాల్తేరు డివిజన్‌కు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూనే ఉన్నారు. ప్రత్యేక జోన్ ఏర్పాటుకు చేసే కీలక నిర్ణయాల్లో సైతం అడ్డంకులు సృష్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి.

పునరుద్ధరించిన రైళ్లు
సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (విశాఖ-గుంటూరు) (17239/40)
డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (విశాఖ-గుంటూరు) (22701/02)
రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (విశాఖ- విజయవాడ) (12717/18)
గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (57271)
విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707/08)
విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220)

11 నుంచి సర్వీసుల పునరుద్ధరణ

దక్షిణ మధ్య రైల్వే పలు ఎక్స్‌ప్రెస్‌లను విశాఖ వైపు నడుపుతోంది. వీటిలో సింహాద్రి, రత్నాచల్, మచిలీపట్నం ఇలా ప్రతి ఎక్స్‌ప్రెస్ అత్యధిక ఆక్యుపెన్సీతో నిత్యం నడిచేవి. కానీ సాంకేతిక కారణాలు చూపించి ఈ సర్వీసులను నిలిపివేశారు. విశాఖ నుంచి ఉదయం సమయాల్లో నడిచే ఈ రైళ్లలో ఉద్యోగులే అత్యధికంగా ప్రయాణించే వారు. టికెట్ ధరలు తక్కువగా, ప్రయాణ వేళలు అనుకూలంగా ఉండడంతో విశాఖ-విజయవాడ మధ్యలో పనులు, వ్యాపారాలు చేసుకొనే వారు సైతం ఈ రైళ్లను ఆశ్రయించేవారు. అయితే పట్టాల మరమ్మతులు, ఆధునికీకరణ పేరుతో కొద్ది నెలల క్రితం ఈ సర్వీసులను నిలిపివేశారు. దీనిపై వాల్తేరు డివిజన్ అధికారులు పలుమార్లు ఆయా డివిజన్ అధికారులకు లేఖలు రాసినా స్పందించలేదు. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే నిర్ణయాలపై తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవడంతో ఆయా డివిజన్ అధికారులు దిగొచ్చారు. సింహాద్రి, ఉదయ్, రత్నాచల్, గుంటూరు-రాయగడ, తిరుపతి డబుల్ డెక్కర్, విశాఖ-మచిలీపట్నం రైళ్లను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈ నెల 11వ తేదీ నుంచి ఈ రైళ్లు పట్టా లెక్కనున్నాయి. అయితే విశాఖ-బెంగళూరు వీకెండ్, విశాఖ-కర్నూలు సిటీ స్పెషల్, విశాఖ-రాజమండ్రి మెము రైలుకు మోక్షమెప్పుడో తెలియని పరిస్థితి నెలకొంది. విశాఖ నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుంది. అయినా ఈ సర్వీసులను పునరుద్ధరించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

పునరుద్ధరణకు నోచుకోనివి
విశాఖ-బెంగుళూరు
విశాఖ-కర్నూలు సిటీ స్పెషల్
విశాఖ-రాజమండ్రి మెము

పూర్ణామార్కెట్‌కు శ్రావణ కళ



పూర్ణామార్కెట్‌లో శ్రావణ శుక్రవారం పూజల కోసం సామగ్రి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

నగరం శ్రావణ శోభను సంతరించుకుంది. తొలిశుక్రవారం పూజలకు మహిళలు సిద్ధమయ్యారు. షాపింగ్‌మాల్స్, మార్కెట్లు, వాణిజ్య సముదాయాలు, బంగారు దుకాణాలన్నీ కళకళలాడాయి. ముఖ్యంగా పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు నగరవాసులు భారీగా పూర్ణామార్కెట్‌కు తరలివచ్చారు. దీంతో ఇసుకేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిపోయింది. పూజాసామగ్రికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. కొబ్బరికాయలు, అగర్‌బత్తీ, వత్తులు, అరటిపండ్లు, పటిక, వరలక్ష్మి వ్రత పుస్తకాలు, పలు రకాలైన పుష్పజాతులు, కూరలు, పప్పులు, నూనెలు అన్నీ అధిక ధరలకే విక్రయాలు సాగించారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వయో వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు

మహారాణిపేట: ఆస్పత్రులు, ఆలయాల్లో వయోవృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా సీనియర్ సిటిజెన్స్ కమిటీ సమావేశం జరిగింది. వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం–2007కి సంబంధించిన అంశాలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ చట్టంపై అవగాహన కల్పించడానికి డివిజన్, మండల స్థాయిలో సదస్సులు నిర్వహించాలన్నారు. వయోవృద్ధులు ఇచ్చే ఫిర్యాదులపై సత్వర చర్యలు ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు ప్రత్యేకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, క్రైం డీసీపీ వెంకటరత్నం, డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి, డీఆర్‌డీసీ పీడీ ఎస్.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

హెచ్‌ఎస్‌ఎల్‌ను సందర్శించిన నార్వే ప్రతినిధి బృందం



హెచ్‌ఎస్‌ఎల్‌లో నార్వే ప్రతినిధి బృందం

విశాఖ సిటీ : నార్వే కంపెనీస్‌కు చెందిన ప్రతినిధుల బృందం హిందుస్థాన్ షిప్‌యార్డ్‌ను సందర్శించింది. నోవా స్పెక్ట్రమ్ అండ్ ఇన్నోవేషన్ నార్వే డైరెక్టర్ సిడెసెల్ నార్విక్ నేతృత్వంలో బృందం నార్-షిప్పింగ్ ఎగ్జిబిషన్-2025కు హెచ్‌ఎస్‌ఎల్ అధికారులను ఆహ్వానించింది. సాంకేతిక భాగస్వాముల సహకారంతో వాణిజ్య, చమురు రంగాల్లో ఉన్న భవిష్యత్తు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు హెచ్‌ఎస్‌ఎల్ ప్రయత్నాలు చేస్తున్న షిప్‌యార్డ్ నార్వేజియన్ కంపెనీల వ్యాపార భాగస్వామ్యాల్లో పాల్గొనాలని కోరింది.

ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడిగా అరుమిల్లి సత్యనారాయణ



విశాఖ సిటీ : ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫ్యాప్సీ) ఉపాధ్యక్షుడిగా కోరమాండల్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుమిల్లి సత్యనారాయణ ఎన్నికయ్యారు. మెకానికల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన సత్యనారాయణ 2010 నుంచి కోరమాండల్ పెయింట్స్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ప్రస్తుతం ఎండీగా కొనసాగుతున్నారు. పెయింట్ తయారీలో విస్తృత అనుభవం కలిగిన ఆయన రాష్ట్రంలో బహుళ తయారీ యూనిట్లను స్థాపించారు. ఆయన నాయకత్వంలో సంస్థ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నుంచి ఉత్తమ నాణ్యత కలిగిన ఉత్పత్తులకు జాతీయ అవార్డులు అందుకుంది.

కలెక్టర్‌ను కలిసిన జీవీఎంసీ అదనపు కమిషనర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి

మహారాణిపేట : జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా నియమితులైన డి.వి.రమణమూర్తి గురువారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో రమణమూర్తి విశాఖ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ జేడీగా కాకినాడ బదిలీపై వెళ్లారు. ఇప్పుడు జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి జిల్లాకు వచ్చారు.

స్పేస్ టెక్నాలజీపై నేడు వర్క్‌షాప్

మహారాణిపేట : బీచ్‌రోడ్డులోని ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఐ) కార్యాలయంలో శుక్రవారం అప్లికేషన్స్ స్పేస్ టెక్నాలజీపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. సైంటిస్టు రిమోట్ సెన్సింగ్ ద్వారా సముద్ర డొమైన్‌లు, సంభావ్య ఫిషింగ్ జోన్‌ల కోసం కమ్యూనికేషన్ /నావిగేషన్స్‌పై ఉపన్యాసాలు, ఫిషింగ్ ఓడలపై అమర్చాల్సిన ట్రాన్స్‌పాండర్లపై (శాటిలైట్ కమ్యూనికేషన్ ఆధారంగా) ప్రదర్శన చేయనున్నారు. దాదాపు 150 మంది మత్స్యకారులు, బోటు యాజమానులు, మత్స్యకార సంఘాల నాయకులు, అధికారులు పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని ఎఫ్ఎస్ఐ విశాఖ మెకానికల్ మెరైన్ ఇంజినీర్ భామిరెడ్డి తెలిపారు.

నేడు కేంద్ర సహాయ మంత్రి సతీష్‌చంద్ర దుబే రాక

మహారాణిపేట: కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దుబే శుక్రవారం విశాఖ వస్తున్నారు. న్యూఢిల్లీ నుంచి రాత్రి 10.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకొని రాత్రి అక్కడ బస చేస్తారు. 10న ఉదయం 7.45 గంటలకు కోరాపుట్ బయలుదేరుతారు. అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి 9 గంటలకు విశాఖ చేరుకుంటారు. ఇక్కడ నుంచి రాత్రి 10.30గంటలకు విమానంలో ఢిల్లీ వెళ్తారు.

నేడు రాష్ట్ర మంత్రి రాక

రాష్ట్ర మత్స్యశాఖ,మార్కెటింగ్,సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం విశాఖ వస్తున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నైపుణ్యంతోనే వృత్తిలో రాణింపు

సబ్బవరం: కాలానుగుణంగా చట్టాలు మారుతుంటాయని, ఆ మార్పులను నిరంతరం గమనిస్తూ అధ్యయనం చేసినప్పుడే న్యాయవాద వృత్తిలో రాణించగలమని రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా చట్టం మారుతుందని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఏ రంగంలో రాణించాలన్నా.. ఆయా రంగాల్లో వచ్చిన మార్పులను అర్థం చేసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మధ్యవర్తిత్వం రంగంలో ఎక్కువగా అవకాశాలు లభిస్తున్నాయన్నారు. కానీ లిటిగేషన్ వైపు రావాల్సిన అవసరం ఉందన్నారు. ట్రయల్ కోర్టులో ప్రాక్టీస్ చేసినప్పుడే నైపుణ్యమైన న్యాయవాదిగా రాణించగలరన్నారు. వీసీ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం ఉపకులపతి గెస్ట్‌హౌస్‌ను జస్టిస్ సోమయాజులు ప్రారంభించారు. రిజిస్ట్రార్ డాక్టర్ నందిని, అకడమిక్ డీన్ సోమా భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.



వీసీ గెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు

శిశువుల కిడ్నాప్ వ్యవహారంపై కలెక్టర్‌కు సీపీ లేఖ

విశాఖ సిటీ: కమిషనరేట్ పరిధిలోని నవజాత శిశు సంరక్షణ, ప్రసూతి కేంద్రాల వద్ద ముందస్తు భద్రతా చర్యలపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి గురువారం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు లేఖ రాసి అందజేశారు. ఇటీవల కొన్ని చోట్ల నవజాత శిశువుల కిడ్నాప్, మార్పిడులు జరిగిన నేపథ్యంలో వాటిని పూర్తిగా నిరోధించడానికి పలు సిఫార్సులు చేశారు. జిల్లాలోని ప్రైవేట్-ప్రభుత్వ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డెలివరీ, నవజాతి శిశువుల సంరక్షణ సదుపాయం ఉన్న ప్రసూతి గృహాల వద్ద శిశువుల కిడ్నాప్‌లు, మార్పిడులు నిరోధించడానికి చేపట్టాల్సిన చర్యలను లేఖలో వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, 24/7 కంట్రోల్ నుంచి పర్యవేక్షణ, నియోనాటల్ కేర్ యూనిట్ వెలుపల ఉన్న ప్రైవేట్ గార్డులు, నవజాత శిశువులు ఉన్న తల్లులకు వసతి కల్పించే గదులు, తల్లులు, శిశువులకు ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌ల ద్వారా శిశువుల మార్పిడికి అవకాశం ఉండదన్నారు. నగరంలో 68 ప్రైవేట్ ఆస్పత్రులు, 12 ప్రభుత్వ ఆస్పత్రులు ఉండగా.. కొన్నింటిలో ఈ సదుపాయాలు లేనట్లు గుర్తించిన విషయాన్ని సీపీ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం

- పాఠశాలల్లో తిష్టవేసిన టీడీపీ నేతలు
- ప్రేక్షక పాత్రలో అధికారులు, పోలీసులు

విశాఖ విద్య/మధురవాడ/ఆరిలోవ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి అంశంలోనూ రాజకీయ జోక్యం పెరిగింది. రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల్లోనూ టీడీపీ నేతలు రెచ్చిపోయారు. తమ పార్టీ నాయకులు, సానుభూతిపరులు పదవుల్లో ఉండేలా.. పాఠశాలల్లోనే తిష్ట వేసి మొత్తం వ్యవహారం నడిపించారు. జిల్లాలో 578 ప్రభుత్వ, 17 ఎయిడెడ్ పాఠశాలలు.. మొత్తం 595 పాఠశాలల్లో గురువారం యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. 403 పాఠశాలల్లో ఏకగ్రీవంగా కమిటీలు ఎన్నిక కాగా.. మిగతా చోట్ల ఎన్నికలు నిర్వహించినట్లు డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు తెలిపారు. తొమ్మిది చోట్ల కోరం లేక ఎన్నికలు వాయిదా వేసినట్లు వెల్లడించారు.

హెచ్‌ఎం కార్యాలయంలోనే టీడీపీ నేతలు

చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు టీడీపీ నేతల కనుసన్నల్లో జరిగాయి. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రధాన అనుచరుడు చిక్కాల విజయ్‌బాబు, ఇతర నాయకులు మొల్లి లక్ష్మణ, పిల్లా వెంకటరావు, పిల్లా నర్సింగరావు, దాసరి శ్రీనివాస్ తదితరులు హెచ్‌ఎం చాంబర్‌లోనే తిష్టవేసి మొత్తం వ్యవహారం నడిపించగా.. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. అయినప్పటికీ.. భోజన విరామ సమయానికి అత్యధిక తరగతుల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు గెలిచే పరిస్థితి కనిపించడంతో ఎన్నిక వాయిదా వేయాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎ.వి.ఎస్ సోమయాజులు, డిప్యూటీ డీఈవో కె.సువర్ణ, ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధలపై తీవ్ర ఒత్తిడి తీసువచ్చారు. ఒకానొక దశలో హెచ్‌ఎంకు ఎన్నికల నిర్వహణ తెలియదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు తమకు చెందిన వారిని గెలిపించుకున్నారు.

ఏసీపీ సునీల్ ఓవర్ యాక్షన్

విశాఖ నార్త్ జోన్ ఏసీపీ సునీల్ సాయంత్రం 3 గంటలు తర్వాత చంద్రంపాలెం హైస్కూల్‌కు వచ్చి అందరినీ భయభ్రాంతులకు గురిచేశారు. హెచ్‌ఎం చాంబర్‌లో అధికారులతో ఆయన మాట్లాడుతుండగా మీడియా ప్రతినిధులు ఫొటో తీసేందుకు యత్నించారు. దీంతో ఆయన మీడియా ప్రతినిధులపై చిందులు వేస్తూ.. పడక గదిలో ఫొటోలు కూడా తీసేసి ప్రైవసీ లేకుండా చేస్తారా? అనే అర్థం వచ్చేలా అసభ్యకర పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. పాఠశాలలో.. అదీ మహిళా అధికారులు, ఉపాధ్యాయినుల ముందు ఇలా మాట్లాడడంతో పలువురు సిగ్గుతో తలదించుకున్నారు. కాగా.. కమిటీ ఛైర్మన్‌గా గుదే అచ్యుతరావు, వైస్ ఛైర్మన్‌గా పొగుడు నూకరత్నం ఎన్నికయ్యారు.

హెచ్‌ఎం అత్యుత్సాహం : పైనాపిల్‌కాలనీ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో ఆ పాఠశాల హెచ్‌ఎం అత్యుత్సాహం ప్రదర్శించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత హెచ్‌ఎం ఒ.రామరాజు కమిటీ సభ్యులతో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే రామకృష్ణబాబు ఫొటోలు ఉన్న బ్యానర్లతో ఫొటోలు దిగారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగా.. పాఠశాలలో ప్రజా ప్రతినిధులు ఫొటోలు ఉన్న బ్యానర్‌ను ఏ విధంగా ప్రదర్శిస్తారంటూ కాలనీ వాసులు ప్రశ్నించారు. హెచ్‌ఎం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక తోటగరువు హైస్కూల్ హెచ్‌ఎం దుర్గాభవాని టీడీపీ నేతలను ఆహ్వానించి మరీ ఎన్నికలు నిర్వహించారు.



పైనాపిల్‌కాలనీ ఎంపీపీ పాఠశాలలో ప్రజాప్రతినిధుల బ్యానర్‌తో నూతన కమిటీ



చంద్రంపాలెం హైస్కూల్ హెచ్‌ఎం చాంబర్‌లో తిష్టవేసిన టీడీపీ నాయకులు

సముద్రంలో మునిగిన బోటు

- మరమ్మతులకు గురైన ఇంజిన్
- సురక్షితంగా చేరుకున్న మత్స్యకారులు
- బోటు యజమానికి రూ.20లక్షల నష్టం

మహారాణిపేట: విశాఖ తీరానికి సమీపంలో గురువారం సాయంత్రం మరబోటు మునిగిపోయింది. ఉదయం ఫిషింగ్ హార్బర్ నుంచి వేటకు వెళ్లిన వీ5-ఎంఎం-529 బోటు ఇంజిన్ మరమ్మతులకు గురైంది. ఈ పరిస్థితుల్లో బోటును ఏదో విధంగా ఒడ్డుకు చేరుద్దామని అందులో ఉన్న మత్స్యకారులు వాసుపల్లి అప్పన్న, వాసుపల్లి లక్ష్మయ్య, వి.రాజు, వి.పార్వతయ్య, అప్పారావు ప్రయత్నించారు. అయితే బోటులోకి నీరు ప్రవేశించడంతో ఆందోళనకు గురయ్యారు. నీటిని తోడేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. సాయంత్రం ఐదు గంటల సమయంలో నీటిలో బోటు మునిగిపోతుండటంతో సముద్రంలో దూకేశారు. ఇది గమనించిన సమీపంలో బోట్లలో మత్స్యకారులు అక్కడకు చేరుకున్నారు. ఇందులో కొందరు ఆ బోట్లు ఎక్కగా.. మరికొందరిని లైఫ్‌గార్డులు రక్షించారు. మునిగిన బోటు తీరం దగ్గరల్లోకి కొట్టుకొచ్చింది. ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులను మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ పరామర్శించారు. బోటును పరిశీలించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జేడీ తెలిపారు. బోటు యజమాని వాసుపల్లి రాజుకు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఏపీ మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి వారిని ఆదుకోవాలని కోరారు.



ఒడ్డుకు చేరిన మత్స్యకారులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ విజయ



సముద్రంలో మునిగిపోతున్న మరబోటు

రౌడీషీటర్లకు నగరంలో చోటులేదు

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ : యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లు ఎవరూ నగరంలో ఉండకూడదని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి అన్ని స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రౌడీషీట్ ఉన్న వారిపై దర్యాప్తు పెండింగ్‌లో ఉన్న కేసులను, కోర్టులో ట్రయల్ అవుతున్న కేసులను పరిశీలించారు. కేసు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలు సమీక్షించి సత్వరమే శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లపై నమోదైన కేసులు, వాటిపై తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ఎక్కువ కేసుల్లో సంబంధం కలిగిన వారిపై రౌడీషీట్ వెంటనే పెట్టాలని ఆదేశించారు. అలాగే స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లను గమనిస్తూ ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్నా తక్షణం కఠిన చర్యలు తీసుకొని జైలుకు పంపించాలన్నారు. అభివృద్ధి చెందుతున్న విశాఖ ప్రశాంతంగా ఉండే విధంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా, రౌడీయిజం, గుండాయిజానికి చోటు లేకుండా నిర్మూలించాలని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫక్కీరప్ప, డీసీపీ-1 అజితా వేజెండ్ల, డీసీపీ-2 తుహిన్ సిన్హా, డీసీపీ(క్రైమ్స్) పి.వెంకటరత్నం, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు

అరిలోవ: అవయవ దాతలకు ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరుగుతాయని జీవన్‌దాన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి కృష్ణబాబు ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. అవయదానం దాతలకు ఆర్డీవో స్థాయి అధికారుల సమక్షంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలకు అవసరమైన నియమావళిని అమలు చేస్తామన్నారు.

75 ఏళ్లుగా జేసీఐ సేవా కార్యక్రమాలు

బీచ్‌రోడ్డు: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా (జేసీఐ) ఆధ్వర్యంలో 75 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని సంస్థ జాతీయ అధ్యక్షుడు రికేష్ శర్మ తెలిపారు. విశాఖలో ఆయన మూడు రోజులు పర్యటించనున్నారు. ఆయనకు జేసీఐ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నగరంలోని జేసీఐ క్లబ్‌లను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 75 మంది సభ్యులు రక్తదానం చేశారని, అదే విధంగా మాదకద్రవ్యాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బీచ్‌రోడ్డులోని బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. అదే విధంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నాలుగువేల మంది పిల్లలకు మూడువేలు చొప్పున స్కాలర్‌షిప్‌లు అందించామన్నారు. సమావేశంలో విశాఖ జోన్‌ప్రెసిడెంట్ సురేష్ గొంప, సభ్యులు కేవీ రావు, నూకరాజు పాల్గొన్నారు.



నేర్పించండి!

వెనుకటి తరం ఇళ్లల్లో పుస్తకాలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. ఎన్ని ఎక్కువ పుస్తకాలుంటే అంత గొప్ప అని భావించేవారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ పుస్తకమే కాలక్షేపం. కానీ కాలక్రమంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో మన జీవనశైలి పూర్తిగా మారిపోయింది. స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా వంటివి మన జీవితంలోకి ప్రవేశించడంతో పుస్తకాలకు ఉన్న ప్రాధాన్యం తగ్గిపోయింది. నేడు పుస్తకాల కంటే సెల్‌ఫోన్‌లే మన కాలక్షేపానికి కేంద్రంగా మారిపోయాయి. ముఖ్యంగా నేటి తరం పుస్తకాలకు దూరంగా ఉంటోంది. ఈ పరిస్థితిని చూస్తున్న సాహితీవేత్తలు, రచయితలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి తరాన్ని పుస్తక ప్రియులుగా మార్చాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నారు. శుక్రవారం జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. – సీతంపేట

'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. కాని ఒక మంచి పుస్తకం కొనుక్కో' అన్నారు కందుకూరి వీరేశలింగం పంతులు. ఆ మాటలు పుస్తక ప్రియుల మదిలో నేటికీ మార్మోగుతూనే ఉన్నాయి. ఒక మంచి పుస్తకం వేయి మంది మిత్రులతో సమానమని అంటారు. పుస్తకం అమ్మలా లాలిస్తుంది.. నాన్నలా ఆదరిస్తుంది. గురువులా హితబోధ చేస్తుంది. బాధపడే వారిని ఓదార్చుతుంది.. అలసిన మనసులను సేదతీరుస్తుంది. విజ్ఞానానికి, మనోవికాసానికి మార్గ నిర్దేశనం చేసే పుస్తకం.. మారిన ఆధునిక జీవన విధానంలో అన్ని వయసుల వారికి దూరమైంది. ఒకప్పుడు పుస్తకమే కాలక్షేపం.. నేటితరం వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టా, యూట్యూబ్ వంటి సోషల్ మీడియాల్లో నిత్యం కాలక్షేపం చేస్తూ.. మానవ సంబంధాలకు దూరంగా ఒంటరి జీవితానికి అలవాటు పడింది. ఒకప్పుడు చాలా మంది ఇళ్లల్లోనే లైబ్రరీలు ఉండేవి.. ప్రత్యేక అద్దాల బీరువాల్లో పుస్తకాలను భద్రపరిచేవారు. నేడు విద్యార్థి దశ నుంచే పుస్తకానికి దూరంగా ట్యాబ్‌లు, సెల్‌ఫోన్లలో పాఠాలు నేర్చుకుంటున్నారు.

పేపర్ లెస్ వర్క్‌లు, నో బ్యాగ్ స్కూళ్లు ఇదీ నేటి పరిస్థితి. ఇప్పటికైనా తల్లిదండ్రులు మేల్కొని పుస్తక పఠనంపై పిల్లల్లో ఆసక్తి పెంచేలా కృషి చేయాలని సాహితీవేత్తలు, మేధావులు కోరుతున్నారు. గ్రంథాలయాలకు వెళ్లేలా పిల్లలను సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వీలైనంత వరకు ఇంటర్నెట్‌పై ఆధారపడకుండా పుస్తకాలు చదివి సందేహాలను నివృత్తి చేసుకునేలా.. తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకునేలా ప్రోత్సహించాలని పిలుపునిస్తున్నారు.

- ఆధునిక జీవనంతో పుస్తకాలకు దూరంగా నేటితరం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సాహితీవేత్తలు, రచయితలు
- పుస్తక పఠనంపై మక్కువ పెంచాలని పిలుపు
- నేడు జాతీయ పుస్తక ప్రియుల దినోత్సవం



సెల్ హస్త భూషణం!



'పుస్తకం హస్త భూషణం'అనే నాటి నుంచి 'సెల్ హస్త భూషణం'గా వెలిగిపోతున్న రోజులివి. ఎక్స్, యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా మత్తెక్కిస్తూ పుస్తకాలను దూరం చేస్తోంది. ప్రతీ చిన్న విషయానికి గూగుల్ వెంటపడుతున్నాం. ఈ కాలంలో సంప్రదాయ సాహిత్యం, అసలు సిసలైన చరిత్ర, మహామహుల రచనలు.. ఇవేవీ కూలంకషంగా అర్థం చేసుకుని మనసులో ముద్రలు వేసుకోగలిగే అవకాశం లేకుండా పోతోంది. పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా.. వారిలోని మనో భావాలను అక్షర రూపంలో గేయాలుగా, కథలుగా, వ్యాసాలుగా రాయడంలో 16 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నాను. పిల్లలు రాసే కథలు, వ్యాసాలు, గేయాలను ప్రచురించేలా బాలబాట మాసపత్రికను నడుపుతున్నాను. వేసవి శిక్షణ శిబిరాలు, భాషా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ నా వంతు కృషి చేస్తున్నాను.

– కొల్లూరు స్వరాజ్యం వెంకట రమణమ్మ, రచయిత్రి, బాలబాట సంపాదకురాలు

ఇంట్లోనే గ్రంథాలయం



పుస్తకంపై అభిమానంతో ఎంవీపీ కాలనీలో నేను ఉంటున్న ఇంట్లో మేడపైన 2013లో గ్రంథాలయం ఏర్పాటు చేశాను. దాతల నుంచి సేకరించిన సుమారు 15 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వంద మంది పిల్లలు కూర్చుని చదువుకునేలా కుర్చీలు, టేబుల్స్ ఏర్పాటు చేశాను. శని ఆదివారాల్లో వంద మంది పిల్లలు చదువుకోవడానికి గ్రంథాలయానికి వస్తుంటారు. 1967–70లో భీమవరంలో నేను డిగ్రీ చదివాను. అప్పట్లో మా ఊర్లో గ్రంథాలయంలో పని చేస్తూ నెల నెలా వారిచ్చిన జీతంతో డిగ్రీ ఫీజు కట్టి చదువును పూర్తి చేశాను. గ్రంథాలయం విశిష్టత, పుస్తక పఠనం ఆవశ్యకత చదువుకునే రోజుల నుంచే నాకు తెలుసు. ఐవోసీలో ఉద్యోగ విరమణ అనంతరం 10 మందికి ఉపయోగపడేలా ఇంట్లోనే లైబ్రరీ ఏర్పాటు చేశాను. ఆధ్యాత్మిక, చరిత్ర, విజ్ఞానం, సాహిత్యం, ప్రముఖ రచయితల రచనలు, రామాయణ, భారత భాగవతాలు ఇలా అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. నేను 9 పుస్తకాలు రచించాను. నేను స్థాపించిన కళావేదిక ద్వారా ఇప్పటి వరకు 30 పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ఔత్సాహిక రచయతలను ప్రోత్సహిస్తున్నాను. –డా.నండూరి రామకృష్ణ, గ్రంథాలయ వ్యవస్థాపకుడు, ఎంవీపీకాలనీ

పుస్తకం.. జ్ఞాన భాండాగారం



వెనుకటి తరంలో ఇంట్లో ఎన్ని ఎక్కువ పుస్తకాలుంటే అంత గౌరవంగా భావించేవారు. వయసుతో నిమిత్తం లేకుండా స్త్రీ, పురుషులిద్దరూ పుస్తకం చదవడమే కాలక్షేపంగా ఉండేది. మరి నేటి తరం అన్నీ మొబైల్ ఫోన్‌లో ఉన్నాయనుకుంటోంది. ఒకప్పుడు మహిళలు నవలలు విరివిగా చదివేవారు. ఇపుడు వారిలో ఆ వ్యాపకం కనుమరుగైంది. పిల్లలను గ్రంథాలయాలకు వెళ్లేటట్టు ప్రోత్సహించడం, మంచి పుస్తకాలు తీసుకొచ్చి చదివించడం పెద్దల బాధ్యత. ఫోన్‌లో వాట్సాప్, యూట్యూబ్, ఇన్‌స్టా గ్రూప్‌లతో కాలక్షేపం.. పుస్తకం చదివే అలవాటును దెబ్బతీసింది. ఇది మన సంస్కృతికి ప్రమాదం. పుస్తకాలను బహుమతులుగా ఇచ్చే అలవాటును ప్రోత్సహించాలి.

– డి.వి.సూర్యారావు, ప్రముఖ రచయిత

ఎర్రమట్టి దిబ్బల్లో జీఎస్ఐ సర్వే

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు ఎర్రమట్టి దిబ్బల్లో గత కొంత కాలంలో త్రవ్వకాలు జరుగుతున్నాయి. భీమిలి హౌసింగ్ సొసైటీకి సభ్యులు ఎటువంటి అనుమతులు లేకుండా జేసీబీల ద్వారా పెద్ద ఎత్తున తవ్వకాలు ప్రారంభించారు. అధికారులు అప్రమత్తమై ఎర్రమట్టిదిబ్బల పరిరక్షణలో భాగంగా తవ్వకాలు నిలిపివేశారు.జియో హెరిటేజ్ సంపదగా ఉన్న ఎర్రమట్టి దిబ్బలను గురువారం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) డైరెక్టర్ బి. బాలచంద్రుడు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఐఎన్ఎస్ కళింగ, నేరెళ్ళవలస, నిడిగట్టు, జేవీ అగ్రహారం నడుమ 1,195 ఎకరాల్లో ఎర్రమట్టి దిబ్బలు విస్తరించి ఉన్నాయి. 2014లో 262.92 ఎకరాలను జాతీయ వారసత్వ ప్రదేశం (జియోహెరిటేజ్ సైట్‌గా) గుర్తించారు. అటువంటి జియో హెరిటేజ్ సైట్ పరిరక్షణ కోసం మరోసారి తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో హద్దులను ఏర్పాటు చేసి వీటిని సంరక్షించుకునేందుకు సర్వే నిర్వహించినట్లు జీఎస్ఐ డైరెక్టర్ బి. బాలచంద్రుడు పేర్కొన్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి జియో హెరిటేజ్ సైట్ ఎంత మేర ఉందో గుర్తించి వాటికి హద్దులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సర్వేలో జీఎస్ఐ ఆఫీసర్లు ఎంవీఎస్ రామశాస్త్రి, ప్రీతమ్ పాయల్, సర్వేయర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న జీఎస్ఐ డైరెక్టర్ బాలచంద్రుడు

ఎయిర్‌పోర్టులో సెక్యూరిటీ కల్చర్ వీక్



విమానాశ్రయంలో ఏవియేషన్ సెక్యూరిటీ వీక్‌లో భాగంగా వాక్‌థాన్ చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో రెండో ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్‌లో భాగంగా గురువారం వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ ఏవియేషన్ భద్రత గురించి ప్రయాణికుల్లో అవగాహన కలిగించేందుకు ఈ నెల 5 నుంచి 11వరకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించామన్నారు. గురువారం సీఐఎస్ఎఫ్, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సిబ్బంది, ఎయిర్‌లైన్స్ ఉద్యోగులు తదితరులతో వాక్‌థాన్ చేశారు. ప్లకార్డులు, ఫ్లెక్సీలు ప్రదర్శించారు. ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో బ్యానర్లను ప్రదర్శించారు.

ఆన్‌లైన్ గేమ్స్‌కు యువకుడి బలి

తండ్రి మందలించాడని ఆత్మహత్య

అల్లిపురం: ఆన్‌లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకున్న ఓ యువకుడిని తండ్రి మందలించడంతో.. ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. కైలాసపురం శాంతినగర్‌కు చెందిన రావాడ జగదీష్(23) ఇంటర్ వరకు చదుకువున్నాడు. తర్వాత పరవాడ ఫార్మాసిటీలో పనిలో చేరాడు. అక్కడ మందుల వాసన పడకపోవడంతో పని మానేశాడు. ఈ క్రమంలో ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి సుమారు రూ.2లక్షల వరకు పోగొట్టుకున్నాడు. దీంతో అతని తండ్రి అప్పారావు అప్పులు చేసి వాటిని తీర్చాడు. అయినా సరే జగదీష్ మళ్లీ రూ.30 వేలు వరకు ఆన్‌లైన్ గేమ్స్ ఆడి పోగొట్టుకున్నాడు. దీంతో జగదీష్‌ను బుధవారం తండ్రి మందలించాడు. తండ్రి మాటలకు కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన జగదీష్.. గురువారం ఉదయం బీచ్‌రోడ్డు గోకుల్ పార్కు వద్ద తీరంలో రాళ్ల విగతజీవిగా కనిపించాడు. బీచ్ గార్డ్స్ అతని మృతదేహాన్ని వెలుపలికి తీసి మహారాణిపేట పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ నందకిశోర్ గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న మృతుడి తల్లిదండ్రులు పోలీసులను సంప్రదించారు. గురువారం రాత్రి మార్చురీలోని మృతదేహాన్ని తమ కుమారుడిగా గుర్తు పట్టారు. అప్పారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రావాడ జగదీష్ మృతదేహం

అవయవ దానంపై విస్తృత ప్రచారం

కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జీవన్‌దాన్‌పై జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. జాతీయ అవయవదాన దినోత్సవం పురస్కరించుకుని ఇటీవల ఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రానికి లభించిన అవార్డును జీవనధాన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. అవార్డును చూపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అవయవదానంపై గ్రామీణ స్థాయి నుంచి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ ఈ అవార్డు స్ఫూర్తితో మరింత పక్కాగా ఈ పథకాన్ని అమలు చేస్తామన్నారు.



జీవన్‌దాన్ అవార్డును ప్రదర్శిస్తున్న కలెక్టర్, రాష్ట్ర కో–ఆర్డినేటర్ రాంబాబు

పాము అడ్డు రావడంతో.. ఏలేరు కాలువలో పడిన భార్యాభర్తలు

భార్య మృతి.. ప్రాణాలతో బయటపడ్డ భర్త

మాకవరపాలెం: పాము అడ్డు రావడంతో బైకుతో సహా ఏలేరు కాలువలో పడిన ఘటనలో భార్య మృతి చెందగా, భర్త ప్రాణాలతో బయటపడ్డాడు. విశాఖ జిల్లా పెందుర్తికి చెందిన కోటిపల్లి నాగేశ్వరరావు, భార్య పాపారత్నంతో కలిసి గురువారం నర్సీపట్నం వచ్చారు. తిరిగి రాత్రి బైక్‌పై పెందుర్తి బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని కొండల అగ్రహారం వద్ద ఏలేరు కాలువ సమీపానికి వచ్చేసరికి పాము రోడ్డుకు అడ్డంగా వచ్చింది. దాంతో అదుపు తప్పి భార్యాభర్తలిద్దరూ బైకుతో సహా ఏలేరు కాలువలో పడిపోయారు. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు ప్రాణాలతో బయటపడ్డాడు. పాపారత్నం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి కొంత దూరంలో మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి పాపారత్నం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



భార్య మృతదేహం వద్ద భర్త నాగేశ్వరరావు

మూడో రోజు దాఖలు కాని నామినేషన్లు

అల్లిపురం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు మూడో రోజు కూడా నామినేషన్లు దాఖలు కాలేదు. ఈ ఎన్నికలు ఈనెల 30న జరగనుండగా.. ఈనెల 13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు ఉంది.

ఉత్సాహంగా ఇండియన్ బ్యాంక్ వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న ఇండియన్ బ్యాంక్ సిబ్బంది

బీచ్‌రోడ్డు: ఇండియన్ బ్యాంక్ 118వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని బ్యాంక్ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ కార్యక్రమాన్ని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేష్ కుమార్ పుర్బే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఇండియన్ బ్యాంక్ చరిత్ర, బ్యాంక్ అందిస్తున్న సేవలు, ఇతర కార్యక్రమాల గురించి వివరించారు. ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో అందిస్తున్న డిపాజిట్ పథకాల గురించి మాట్లాడారు. సామాజిక బాధ్యతలో భాగంగా మొక్కలు నాటినట్లు చెప్పారు. వాక్‌థాన్‌లో సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేశారని ఆనందం వ్యక్తం చేశారు.







'సెల్' గాటం

తెల్లరి లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు చాలా మందికి సెల్‌ఫోనే ప్రపంచమైపోతోంది. ఖాళీగా ఉన్నా.. తింటున్నా.. నడుస్తూ రోడ్లపై వెళుతున్నా.. మొబైల్స్‌కే అంకితమైపోతున్నారు. అత్యంత జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాల్సిన సమయాల్లో సైతం ఫోన్ ముచ్చట్లు ఆగడం లేదు. నగరంలో సెల్‌ఫోన్ డ్రైవింగ్ విపరీతంగా కనిపిస్తోంది. ఆడ, మగ అనే తేడా లేదు. ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ వాహనాలపై రయ్‌రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. ఫోన్లు మాట్లాడుతూ పరధ్యానంగా వాహనాలు నడపడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నా ఏ ఒక్కరిలో భయం, బాధ్యత ఉండడం లేదనడానికి ఈ దృశ్యాలే నిదర్శనం.

–ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం









వస్త్ర దుకాణంలో మందుల విక్రయం

- టాస్క్‌ఫోర్స్, జిల్లా ఔషధ నియంత్రణ తనిఖీ అధికారుల దాడులు
- దుకాణ యజమానిపై కేసు నమోదు

గోపాలపట్నం: అది ఓ వస్త్ర దుకాణం. కానీ అక్కడ రహస్యంగా మందుల అమ్మకాలు సాగుతున్నాయి. దీనిపై పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, జిల్లా ఔషధ నియంత్రణ తనిఖీ అధికారులు సంయుక్తంగా దాడి చేసి.. మందులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించి జిల్లా ఔషధ నియంత్రణ తనిఖీ అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. బాజీ జంక్షన్ సమీపం బుచ్చిరాజుపాలెం ప్రధాన రహదారిలో కె.కె.సిల్క్స్ వస్త్ర దుకాణం ఉంది. ఇక్కడ ఎటువంటి అనుమతి లేకుండా మత్తు మందులు, నిద్ర మాత్రలు, సిల్డెనాఫిల్ సిట్రేట్, అబార్షన్ కిట్లు విక్రయిస్తున్నారు. దీనిపై పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, జిల్లా ఔషధ నియంత్రణ తనిఖీ అధికారులు దుకాణంపై దాడి చేసి.. తనిఖీలు చేపట్టారు. రూ.4వేల విలువైన అల్ప్రజోలం, సిల్డెనాఫిల్ సిట్రేట్, అబార్షన్ కిట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమాని మల్లిపూడి హరికృష్ణపై డ్రగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. దీనిపై లోతుగా విచారణ చేపడతామని శ్రీనివాసరావు తెలిపారు. ఇలాంటి మందులు అనుమతులు ఉన్న మెడికల్ షాపుల్లో మాత్రమే విక్రయించాలన్నారు. వస్త్ర దుకాణంలో అమ్మకాలు సాగించడం నేరమన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



కె.కె.వస్త్ర దుకాణంలో డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్న మందులు

700 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణ

నిర్ధారించిన రెవెన్యూ అధికారులు

కొమ్మాది: రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద బీచ్‌ను ఆనుకుని ఓ వ్యక్తి తన స్థలంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని కూడా ఆక్రమించాడు. సమాచారం అందుకున్న ఆర్ఐ ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది గురువారం ఆ స్థలాన్ని పరిశీలించారు. రుషికొండ సర్వే నంబర్ 2/17 సాగరతీరంలో సుమారు 700 గజాల స్థలాన్ని ఆక్రమించినట్లు నిర్ధారించారు. బీచ్‌కు ఆనుకుని ఉన్న స్థలంలో మట్టి వేసి ఆక్రమించినట్లు ఆర్ఐ తెలిపారు. ఇక్కడ హద్దులను పరిశీలించిన ఆర్ఐ.. కంచె లేదా రక్షణ గోడ నిర్మించాలనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

చిట్టీల నిర్వాహకుల అరెస్ట్

పెందుర్తి: వరలక్ష్మి చిట్టీల పేరుతో ప్రజల నుంచి నగదును వసూలు చేసి మోసగించిన ఇద్దరు నిర్వాహకులను పెందుర్తి పోలీస్‌లు అరెస్ట్ చేశారు. సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పెందుర్తి పోస్టాఫీస్ సమీపంలో ఉంటున్న తండ్రీకూతుళ్లు దొర, మాధవి ఏడాది కాలంగా వరలక్ష్మి చిట్టీలతో పాటు నెలవారీ చిట్టీలు నిర్వహిస్తున్నారు. పాట పాడుకున్న వారికి నగదు ఇవ్వకుండా తిప్పుతున్నారు. మోసపోయామని గ్రహించిన బాధితులు బుధవారం సాయంత్రం పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులిద్దరినీ అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరింత మంది బాధితులు ముందుకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.